జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బీఎస్సీ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ సైన్సెస్ కోర్సుల ఫలితాల్లో ..

బొల్లినేని విజయదుందుంభి

- యూనివర్సిటీ స్థాయిలో 23 మందికి ర్యాంకుల పంట
- వివిధ కోర్సుల్లో ఆరుగురికి ప్రథమ ర్యాంకులు
- విద్యార్థులను అభినందించిన ఈడీ నాగేశ్వరరావు

శ్రీకాకుళం, జూన్ 13(వార్త): ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం విడుదల చేసిన బీఎస్సీ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ సైన్సెస్ కోర్సుల ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర ఫలితాల్లో రాగోలులోని జెమ్స్ ఆవరణలో గల బొల్లినేని మెడ్‌స్కిల్స్ బీఎస్సీ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ సైన్సెస్ కాలేజీ విద్యార్థులు విజయదుందుంభి మోగించారు. యూనివర్సిటీ స్థాయిలో వివిధ కోర్సుల్లో ఆరుగురు విద్యార్థులు ప్రథమ ర్యాంకులు సాధించారు. ముగ్గురు రెండో ర్యాంకు, ఒకరు మూడో ర్యాంకు, ఇద్దరు నాలుగో ర్యాంకు, ఒకరు ఐదో ర్యాంకు, ముగ్గురు ఆరో ర్యాంకు, ఒకరు ఏడో ర్యాంకు, ముగ్గురు ఎనిమిదో ర్యాంకు, ఇద్దరు తొమ్మిదో ర్యాంకు, ఒకరు పదో ర్యాంకుతో తమ సత్తా చాటారు. తృతీయ ఏడాదిలో తొమ్మిది మంది ఉన్నత శ్రేణిలో, 45 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 20 మంది ఉన్నత శ్రేణిలో, 35 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. తొలి ఏడాది ఫలితాల్లో పది మంది ఉన్నత శ్రేణిలో, 40 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏటా తమ విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో ర్యాంకులు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. అత్యుత్తమ బోధన, విద్యార్థుల అంకితభావంతోనే ఈ ఫలితాలు సాధించగలుగుతున్నామన్నారు. ఈ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు దేశ, విదేశాల్లో వైద్య రంగంలో విస్తృత అవకాశాలు గలవన్నారు. ఇప్పటికే తమ విద్యార్థులు విదేశాల్లో స్థిరపడి, ఉన్నతంగా స్థిరపడడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆయన ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందించారు. జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీపద్మజ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

Bollineni Medskills B.Sc. Allied and Healthcare College
(A unit of Aditya Educational Society)
CELEBRATING ACADEMIC EXCELLENCE
DR. NTR UNIVERSITY OF HEALTH SCIENCES - Bollineni Medskills B.Sc. Allied and Healthcare College RESULTS-MARCH 2026

REJETI HARSHAVARDHAN
24/11/12/0013 - B.Sc. PAT
University Rank : 1st
10 Distinction in First Year
40 First Class in First Year

కారుచీకట్లో కాశీబుగ్గ ..!

-నెల రోజులుగా వెలగని వీధి లైట్లు..
-ప్రజలకు నిత్య నరకం
- అధికారుల నిర్లక్ష్యంతో అంధకారంలో పెద్ద బ్రాహ్మణ వీధి



పలాస, జూన్ 13 (వార్త): పట్టణాభివృద్ధికి ప్రతీకగా నిలవాల్సిన వీధులు చిమ్మచీకటిలో మగ్గిపోతే ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో కాశీబుగ్గలోని పెద్ద బ్రాహ్మణ వీధిని చూస్తే అర్థమవుతోంది. నెల రోజులుగా ఈ ప్రాంతంలో వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంధకారం అలుముకోవడంతో కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్నారు. సాయంత్రం అయ్యిందంటే చాలు వీధి మొత్తం చీకటిలో మునిగిపోతోంది. రోడ్లపై నడిచే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు రాత్రి వేళల్లో బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీధి లైట్లు వెలగకపోవ డంతో విషసర్పాలు, తేళ్లు, ఇతర విషపురుగుల సంచా రం పెరిగిందని కాలనీవాసులు చెబుతున్నారు. చీకటి కారణంగా అవి కనిపించక ప్రమాదాలు జరిగే అవ కాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు విషపురుగులు ఇళ్ల పరిసరాల్లో కనిపించాయని స్థానికులు పేర్కొంటున్నారు. చీకటిని ఆసరాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉందనే భయం కూడా ప్రజలను వెంటాడుతోంది. ప్రజల భద్రతకు అత్యంత అవసరమైన వీధి దీపాల నిర్వహణలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత నెల రోజులుగా సమస్య కొనసాగుతున్నప్పటికీ ఇప్పటి వరకు అధికారులు స్పందించకపోవడంపై కాలనీ వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని సార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పెద్ద బ్రాహ్మణ వీధిలో వీధి లైట్లను వెంటనే మరమ్మతులు చేసి వెలుగులు నింపాలని, ప్రజలు భయాందోళనలు లేకుండా సంచరించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని, అంధకారంలో మగ్గుతున్న ఈ వీధికి వెలుగులు తీసుకురావాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటీ సీట్లలో
కరవంజ మోడల్ స్కూల్ సత్తా

-17 మంది విద్యార్థులకు ఆర్జీయూకేటీలో ప్రవేశాలు
- విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ అభినందనలు

జలుమూరు, జూన్ 13 (వార్త): ఏపీ మోడల్ స్కూల్, కరవంజ విద్యార్థులు మరోసారి ప్రతిభ చాటారు. ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ) ప్రవేశాల్లో విశేష ఫలితాలు సాధించారు. 17 మంది విద్యార్థులు సీట్లు సాధించి విద్యా సంస్థకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శివ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల సమర్థవంతమైన బోధన, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయం సాధ్యమైందన్నారు. ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందడం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందన్నారు. ఈ విజయాన్ని అందించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత ఫలితాలు సాధించి పాఠశాల ఖ్యాతిని మరింత పెంచాలని విద్యార్థులకు సూచించారు. విద్యా ప్రమాణాల పెంపుదలతో పాటు పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పాఠశాల యాజమాన్యం కృషి కొనసాగిస్తుందని తెలిపారు. పాఠశాల సాధించిన ఈ విజయంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

భూములు కావవి..
మా భుక్తి..!

- గ్రీన్ ఫీల్డ్ కార్గో ఎయిర్‌పోర్ట్ కు భూములు ఇవ్వం
- తప్పుడు ప్రచారాలను చేయడం అన్యాయం
- స్పష్టం చేసిన రాంపురం బాధిత రైతులు

మందస, జూన్ 13(వార్త): గ్రీన్ ఫీల్డ్ కార్గో ఎయిర్‌పోర్ట్‌కు భూములు ఇవ్వడం లేదని, తాము ముందుకు వచ్చినట్టు తప్పుడు ప్రచారాలను చేయడం అన్యాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మందస మండలంలోని రాంపురంలో శనివారం వారు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్ట్ కోసం భూములు ఇవ్వడానికి రాంపురం గ్రామ రైతులు ముందుకు వచ్చారనేది పూర్తి స్థాయిలో అవాస్తవమన్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు ఇకనైనా మానుకోవాలని, భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. గత 20 నెలలుగా పచ్చని మా ఉద్దాన భూముల్లో కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేయవద్దని అనేకవిధాలుగా నిరసనలు తెలియజేస్తూనే ఉన్నామన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక శాసన సభ్యురాలు గౌతు శిరీష, ఇతర అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు కూడా తమ వైఖరి స్పష్టంగా తెలియజేశామన్నారు. వంశపారంపర్యంగా వస్తున్నటివంటి మా భూములు నిత్యం ఆదాయం ఇచ్చే కొబ్బరి, జీడిమామిడి, పనస, మునగ, మామిడి అలాగే మూడు పంటలు పండే పొలాలు ముఖ్యంగా కూర గాయలు, ఆకుకూరలు పండించే బంగారు భూములని కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం తీసుకోని కార్పొరేట్ కంపెనీలకు కట్టపెట్టవద్దన్నారు. భూములనే నమ్ముకున్న రైతుల పొట్ట కొట్టవద్దని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకుంటున్నామన్నారు. గ్రామాలకు దూరంగా ఎక్కడైనా ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఉంటే అక్కడ ఇటువంటి నిర్మాణాలు చేసుకోవాలని కోరారు. ఇకనైనా ఇలాంటి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని, రైతుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. కార్యక్రమంలో బాధిత రైతులు దున్న రామారావు, మర్ల సంతోష్, జుత్తు భూపతి, తామాడ వాసు, జుత్తు జోగారావు, దున్న సురేష్, తామాడ ఎర్రయ్య, కీలు కాంతారావు, కోయిల రామస్వామి, మర్ల సూర్యనారాయణ, మర్ల కృష్ణారావు, తామాడ ధర్మారావు, పలాస కృష్ణారావు, జుత్తు లచ్చయ్య, తామాడ రాజారావు, కర్నెని కూర్మారావు, దున్న పీతంబరం, మహిళా రైతులు, యువకులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

పలాస, జూన్ 13 (వార్త): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం ఆమె పలాసలోని తన కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు 16 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తం రూ.6,33,995 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు అవసర మైన సమయంలో ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే గౌతు శిరీషకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సహారా డిపాజిటర్ల ఆందోళన

ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు

సోంపేట, జూన్ 13(వార్త): సహారా ఇండియా సంస్థలో జమ చేసిన డిపాజిట్లు తిరిగి చెల్లించాలని కోరుతూ సోంపేటలో డిపాజిటర్లు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోనే సుమారు రూ.500 కోట్లు, రాష్ట్రవ్యాప్తంగా 30 వేల కోట్లకు పైగా ప్రజల సొమ్ము సంవత్సరాలుగా చిక్కుకుపోయిందని సహారా ఫీల్డ్ వర్కర్స్ అండ్ డిపాజిటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. సంఘ నాయకులు బి.సత్తి రాజు, టి.దూదిప్పి, నల్ల మధుసూదన రావు, నల్ల రూపసుందరరావు, ఎన్.మాధవరావు తదితరులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ డా.సీపాన గుణవతిని కలిసి వినతిపత్రం అందజేశారు.

పేదలు, రైతులు, కార్మికులు, చిన్న వ్యాపా రులు, మహిళలు వృద్ధాప్యం, పిల్లల చదువు, వివా హాలు, వైద్యం కోసం దాచుకున్న డబ్బు అందక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. డా.సీపాన గుణవతి మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని డిపాజిటర్లకు న్యాయం చేయాలని కోరారు.

రెండేళ్లలోనే పలాస అభివృద్ధి

- ఎమ్మెల్యే గౌతు శిరీషా కృషితోనే సంక్షేమం

- తెలుగు యువత అధ్యక్షుడు ఔగాన ఈశ్వరరావు

మందస, జూన్ 13(వార్త): ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో పలాస నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని తెలుగు యువత అధ్యక్షుడు ఔగాన ఈశ్వ రరావు అన్నారు. మందస పట్టణంలోని శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌతు శిరీష కృషితో ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. పదవీ బాధ్యతలు చేపట్టి రెండేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.

మంచినీటి పథకాలు

పలాస-కాశీబుగ్గ ప్రజల దశాబ్దాల మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా యూఐడీఎఫ్ ట్రెంచ్-2.0 కింద రూ.121.99 కోట్లతో సమగ్ర మంచినీటి పథకం మంజూరైందన్నారు. రేగులపాడు వద్ద ఇన్-టేక్ వెల్, వీరభద్రపురంలో 13.50 ఎంఎల్డీ శుద్ధి కేంద్రం, సూదికొండ 1000కేఎల్, ఆర్ అండ్ బి బంగ్లా 1500కేఎల్ ట్యాంకులు, 80కి.మీ పైప్ లైన్, 13,000 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఎస్సీఏడీఏ వ్యవస్థ, స్మార్ట్ మీటర్లతో అత్యాధునికంగా నిర్మిస్తున్నారని, ఎన్సీసీ లిమిటెడ్ సంస్థకు కాంట్రాక్ట్ అప్పగించి సర్వే పనులు ప్రారంభమయ్యాయన్నారు.

రోడ్లు, భవనాలు

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 17వ వార్డు తిలక్‌నగర్‌లో రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిందని, 13వ వార్డు, 5వ వార్డు తాళభదలో సీసీ రోడ్లు, మురుగు కాలువలకు శంకుస్థాపన చేశారని, రాజాం కాలనీలో రూ.11లక్షల ఎంపీ నిధులతో కమ్యూనిటీ భవనం ప్రారంభించడం జరిగిందన్నారు.

మందస మండలం అభివృద్ధి

మందస మండలం రాంపురం గ్రామం పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైందని, మందస బ్లాక్ కాంప్లెక్స్‌లో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం భవనానికి శంకుస్థాపన చేశారని. మండలంలోని ప్రతీ గ్రామంలో, మారుమూల ప్రాంతాలలో సైతం సీసీ రోడ్లు, మినీ వాటర్ స్కీమ్‌ల ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు.

సంక్షేమ పథకాలు

తల్లికి వందనం పథకం కింద 67,27,164 మంది తల్లులకు రూ.15,000 చొప్పున రూ.8,745 కోట్లు జమ చేశారని. పెంచిన పెన్షన్‌తో పాటు 3నెలల బకాయిలు కలిపి రూ.7000 చెల్లించారన్నారు. దీపం పథకం కింద 2ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారని. పలాసలో అన్నా క్యాంటీన్లు పునఃప్రారంభించి రూ.5కే భోజనం అందిస్తున్నారని, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు.

విద్యాభివృద్ధి

పలాసలో కేంద్రీయ విద్యాలయం మంజూరైంది. రైల్వే పాఠశాల భవనాల్లో తాత్కాలిక తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

ఎమ్మెల్యే గౌతు శిరీష సారథ్యంలో పలాస నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, ప్రతీ వార్డులో, ప్రతీ గ్రామంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మరింత ప్రగతి పలాస నియోజకవర్గంలో జరుగుతుందని చెప్పారు.

ఆర్జీయూకేటీలో మెరిసిన నక్షత్ర

మందస, జూన్ 13(వార్త): ఆర్జీయూకేటీలో విద్యార్థిని దున్న నక్షత్ర మెరిసింది. పల్లిసారధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నక్షత్ర 573 /600 మార్కులతో ఆర్జీయూకేటీ ఏపీలోని శ్రీకాకుళం క్యాంపస్ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యింది. ఆమె ఎంపికపై తల్లిదండ్రులు కవిత, రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యవ్వారి కాంతారావు, ఉపాధ్యాయులు గుంట కోదండరావు, కె.మాధవరావు, బి.అన్నపూర్ణ, ఎస్.పాపారావు ఎం.హరనాథ్, ఎన్.విష్ణుమూర్తి, పల్లిసారథి గ్రామ సంఘ పెద్దలు ఆనందం వ్యక్తం చేశారు.

నగరంపల్లి విద్యార్థి కిరణ్‌కుమార్ ఎంపిక

పలాస, జూన్ 13 (వార్త): విడుదలైన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో వజ్రపుకొత్తూరు మండలం, నగరంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కదిరి కిరణ్ కుమార్ ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళంనకు ఎంపికయ్యాడు. పదోతరగతిలో 575 మార్కులు సాధించి వజ్రపుకొత్తూరు మండల ప్రథమునిగా నిలిచాడు. కిరణ్‌ని ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు, విద్యా కమిటీ చైర్మన్ బి.లక్ష్మీపతి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు అభినందించారు.

రక్తదాత గిరిబాబు

ఇచ్ఛాపురం, జూన్ 13(వార్త): మండపల్లికి చెందిన పాతిర్ల గిరిబాబు రెడ్డి ఇప్పటికి వరకు 19 సార్లు రక్తదానం చేశారు. అరుదైన బ్లడ్ గ్రూప్ (ఏ నెగిటివ్)ను గర్భిణులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు రక్త దానం చేయడమే గాక 7 రక్తదాన శిబిరాలను జీఎస్ ఫౌండేషన్ ద్వారా అనపాన శ్రీరామ్ రెడ్డితో కలిసి పాల్గొని నిర్వహించారు. వివిధ సామాజిక సేవలో భాగస్వామిగా ఉంటూ పేదవారికి సహాయం చేశారు. అత్యవసర సమయాల్లో రక్తదానం చేయడం తనకు చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.

వైభవంగా శ్రీవల్లీ దేవసేనసహిత

సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవం

మందస, జూన్ 13(వార్త):
మందసలోని శ్రీవల్లీ దేవసేనసహిత శ్రీసుబ్రహ్మణ్య స్వామి దేవాలయ చతుర్థ వార్షికోత్సవం సందర్భంగా శనివారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవల్లీ దేవసేనసహిత శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ(బొట్టేశ్వరవీధి, మందస) ఆధ్వర్యంలో ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. మందస గ్రామంలో గల బోట్టేశ్వర ఆలయం వద్ద ఉన్న చతుర్దశ భువనదీశుని కుమారుడు నాగలోకాధీశుడు, సంతాన కారకుడు, వివాహ కారకుడు, అన్యోన్య దాంపత్య ఆరాధనుడు, మన ముక్కంటి కుమారుడు ఆరోగ్య ప్రదాత శ్రీవల్లీ దేవసేనసహిత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ చతుర్థ వార్షికోత్సవం సందర్భంగా విశేష పూజా కార్యక్రమములు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన అన్ని కార్యక్రమాలలో భక్తులు విరివిగా పాల్గొని శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఉదయం 5.30గంటల నుంచి 8 గంటల వరకు అఖండ దీపారాధన, మూల విరాట్లకు భక్తులచే పాలాభిషేకం, 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షా సూత్ర ధారణ పరిషత్ ప్రాయశ్చిత్తం, మండప అవాహనము సుబ్రహ్మణ్య పాశుపత అభిషేకం, శాంతి హోమము జరిగాయి. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్న సమారాధన(నారాయణ సేవ), మధ్యాహ్నం 3.30గంటల నుంచి శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులు కోలాట నృత్యాలతో, మేళ తాళాలతో తిరువీధులలో ప్రదక్షిణ జరిగాయి.

రాత్రి 8గంటలకు ఉయ్యాల సేవ గావించారు. కార్యక్రమంలో భక్తులు, మందస గ్రామపెద్దలు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణతో

రైతులకు మరింత మేలు

పలాస, జూన్ 13(వార్త): వ్యవసాయ యాంత్రీకరణతో రైతులకు మరింత మేలు చేకూరుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. వజ్రపుకొత్తూరు మండలంలోని ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ సాగు యంత్రాల బ్యాంకు "కస్టమ్ హైరింగ్ సెంటర్"ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి రావడంతో సాగు ఖర్చులు తగ్గడంతో పాటు వ్యవసాయ పనులు వేగవంతంగా పూర్తవుతాయని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు ఖరీదైన వ్యవసాయ యంత్రాలను కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్ ద్వారా తక్కువ అద్దెకు యంత్రాలను పొందడం ఎంతో ప్రయోజనకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం వ్యవసాయ యాంత్రీకరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రైతులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. అనంతరం కస్టమ్ హైరింగ్ సెంటర్‌లో అందుబాటులో ఉన్న వివిధ వ్యవసాయ యంత్రాలను ఎమ్మెల్యే పరిశీలించి, వాటి వినియోగంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, ఎంపీడీఓ ఎన్ రమేష్‌నాయుడు, వ్యవసాయ శాఖ అధికారులు, వెలుగు సిబ్బంది ఎఫ్‌పీఓ ప్రతినిధులు, వజ్రపుకొత్తూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు,

మహిళలను పిల్లల్ని కనే యంత్రాలుగా చూడొద్దు

- ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ

- పీఓడబ్ల్యూ 9వ రాష్ట్ర మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

పలాస, జూన్ 13(వార్త): మహిళలను పిల్లల్ని కనే యంత్రాలుగా చూడడం మానుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు బతకల ఈశ్వరమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం బొడ్డపాడు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 33% మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. పి.ఓ.డబ్ల్యు 9వ రాష్ట్ర మహాసభల ను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

బొడ్డపాడులో కరపత్ర ఆవిష్కరణ

ప్రగతిశీల మహిళా సంఘం (పి.ఓ.డబ్ల్యు) 9వ రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని శనివారం బొడ్డపాడు గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు బతకల ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఎటువంటి షరతులు లేకుండా ఓబీసీ, మైనారిటీ మహిళలకు సబ్‌కోటాలతో సహా 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలన్నది దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రజాస్వామ్య ఆకాంక్ష అని పేర్కొన్నారు. మహిళా ఉద్యమాలు, ప్రజాస్వామిక శక్తుల పోరాటాల ఫలితంగానే మహిళా రిజర్వేషన్ సాధ్యమైందని, దానిని "నారీ శక్తి వందన్" పేరుతో రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం సరైంది కాదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ మాట్లాడుతూ మహిళలను మనుషులుగా కాకుండా పిల్లలను కనే యంత్రాలుగా చూసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. "ఒక బిడ్డ వద్దు - ముగ్గురు బిడ్డలు ముద్దు" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ప్రకటనలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేవన్నారు. మహిళలపై మనువాద భావజాలాన్ని రుద్దే ప్రయ త్నాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు, ముఖ్యంగా మహిళలు, దళితులు, ఆది వాసీలకు ఉపాధి, ఆదాయం, సామాజిక భద్రత కల్పించడంలో కీలక పాత్ర పోషిం చిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిధుల కోతలు, పని దినాల తగ్గింపు, వేతనాల చెల్లింపుల్లో జాప్యం ద్వారా ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకం స్థానంలో తీసుకురావాలనుకుంటున్న వి.బి.జి.ఆర్.వై పథకం ద్వారా ప్రజలకు చట్టబద్ధమైన ఉపాధి హక్కు లేకుండా చేస్తున్నారని, ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం భరించిన నిధులలో 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం వల్ల పథకం అమలు దెబ్బతింటుందని అన్నారు. అందువల్ల ప్రస్తుతం అమల్లో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ మూడు ప్రధాన డిమాండ్లపై జూన్ 1 నుంచి 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు, ధర్నాలు, సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 15వ తేదీన ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు వంకల డిల్లేశ్వరి, బొడ్డపాడు మహిళా సంఘం లలిత, వరాలమ్మ, కళావతి పాణిగ్రాహి, హేమావతి, పార్వతి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

ట్రిపుల్ ఐటీలో కేజీబీవీ విద్యార్థినిల ప్రతిభ

మందస, జూన్ 13(వార్త): కేజీబీవీ విద్యార్థినిలు మరోసారి తమ ప్రతిభను చాటారు. మందస మండలంలోని వీరగున్నమ్మపురం సమీపంలో గల కేజీబీవీకి చెందిన ఇద్దరు విద్యార్థినిలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. బైరిసారంగపురం గ్రామానికి చెందిన కోడి జోష్ణ పదో తరగతిలో 585 మార్కులు సాధించింది. హంసరాళి గ్రామానికి చెందిన బెహరా సాలిని 574 మార్కులు పొందింది. వీరిద్దరూ శనివారం విడుదలైన త్రిబుల్ ఐటీ ఫలితాలలో నూజివీడు క్యాంపస్, శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికయ్యారు. వీరిద్దరిని ప్రిన్సిపాల్ రఘుపాత్రుని వాసంతి, ఇతర ఉపాధ్యాయుల బృందం, తల్లితండ్రులు అభినందించారు.

చిన్నబాడం విద్యార్థుల ఎంపిక

పలాస, జూన్ 13 (వార్త): చిన్నబాడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారు. పి.సాహితీ, కె.సునీత కడప, ఎం అక్షిత శ్రీకాకుళం, డి.నికిత ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నబాడం నుంచి తొలి విడత నలుగురు విద్యార్థులు ఎంపికవ్వడంపై ప్రధానోపాధ్యాయురాలు చింతాడ ఉషారాణి, ఉపాధ్యాయులు గేదెల జగదీశ్వరరావు, సనపల జయలక్ష్మి, కోనేటి గోవింద రాజులు, షణ్ముఖరావు, నిర్మల, తెలికల గీత హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ ఎంపికపై పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కల్లేపల్లి చిన్నారావు హర్షం వ్యక్తం చేశారు.

పురుషోత్తపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో ..

సేవలు మెరుగుపరచాలి

ఇచ్చాపురం, జూన్ 13(వార్త): ఇచ్చాపురం మున్సిపాలిటీ పరిధిలో గల 1,2, 3 వార్డు ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొని రావాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం రూ.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పట్టణ ప్రాథమిక వైద్య కేంద్రంలో ప్రస్తుతం గత రెండున్నర నెలలుగా వైద్యం అందించేందుకు డాక్టర్ లేకపోవటం బాధాకరం అని నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి అన్నారు. మంచి ల్యాబ్, ఫార్మసీ, 5 పడకలు గల ప్రాథమిక వైద్య కేంద్రంలో స్టాఫ్ నర్స్ తో వైద్యం అందిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఆసుపత్రి లో కేవలం ఫార్మాసిస్ట్ ఒక్కరు మాత్రమే ఉన్నారని, ఆసుపత్రిలో తాగునీరు సదుపాయం కూడా లేదని అన్నారు. ఆసుపత్రి పరిశీలన కార్యక్రమంలో గమనించిన అంశాలు జిల్లా కలెక్టర్, కమిషనర్ అఫ్ హెల్త్ దృష్టికి తీసుకొని వెళ్లామన్నారు. ఈ పరిశీలనలో సాలిన గాంధీ, చాట్ల తిరుపతి, రత్నాల ఢిల్లీ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో

కాంగ్రెస్ బోలోపేతానికి కృషి చేయాలి

- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సనపల అన్నాజీ

పలాస, జూన్ 13 (వార్త): రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బోలోపేతానికి కృషి చేయాలని, కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి ప్రతి కార్యకర్త సైనికుల పని చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సనపల అన్నాజీ పిలుపునిచ్చారు. రానున్న స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను పోటీకి ప్రణాళికలకు కాశీబుగ్గ పట్టణ పరిధిలో ఉన్న టీకేఆర్ కల్యాణ మండపంలో స్థానిక నాయకులతో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సనపల అన్నాజీ సమక్షంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తంగుడు రమణయ్య అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రజల స్వచ్ఛే స్వతంత్రియాలకు, రాజ్యాంగం పరమైన చట్టాలను అనుసరించి, ప్రజాస్వామ్య పరిపాలనకు పుట్టినిల్లు ఇందిరా కాంగ్రెస్ అనే విషయం ప్రజలు గమనించారన్నారు. రానున్న 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దేశంలో విజయం సాధించి భావి ప్రధాని రాహుల్ గాంధీని అన్నారు. తెంబూరి మధుసూదనరావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పేదల ఆశా జ్యోతి కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ దళిత విభాగం, బీఎల్ఏలకు ధ్రువీకరణ పత్రాలను అన్నాజీ అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు తంగుడు సత్యం, శ్రీరంగం సురేష్, బద్రి సీతమ్మ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహా నిరసన ర్యాలీ విజయవంతం

- వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు

- వైఎస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు

పలాస, జూన్ 13 (వార్త): కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పలాస పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా నిరసన ర్యాలీ విజయవంతమైందని, రైల్లో పాల్గొన్న వాళ్లందరికీ కృతజ్ఞతలు అని వైఎస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ర్యాలీకి నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువతతో పాటు సామాన్య ప్రజలు హాజరయ్యారని చెప్పారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తూ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. పలాస పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో పాల్గొన్న ప్రజలు ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన వ్యక్తం చేశారని తెలిపారు. ర్యాలీ విజయవంతానికి సహకరించిన పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్సీపీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, రాబోయే రోజుల్లో కూడా ప్రజల పక్షాన మరింత ఉద్ధృతంగా ఉద్యమాలు చేపడతామని దుర్యోధనరావు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకు వెళ్లడం కొనసాగిస్తామని, ప్రజలకు అండగా నిలవడం పార్టీ బాధ్యతగా భావిస్తోందని ఆయన పేర్కొన్నారు.

సర్‌పై వజ్జను ఆశ్రయించిన ముస్లింలు

పలాస, జూన్ 13 (వార్త): సర్ ప్రక్రియకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న అనేక సందేహాలు, అపోహలను నివృత్తి చేసి సరైన అవగాహన కల్పించాలని కోరుతూ పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధికి చెందిన ముస్లిం సోదరులు శనివారం ఏపీ టీడీపీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వజ్జ బాబూరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సర్ ప్రక్రియపై ప్రజలకు పూర్తి స్థాయిలో సమాచారం అందడం లేదని, ముఖ్యంగా బీఎల్ఓల ద్వారా సరైన మార్గదర్శకాలు అందకపోవడంతో అనేక మంది అయోమయంలో ఉన్నారని తెలిపారు. దీనివల్ల ప్రజల్లో అనవసర భయాందోళనలు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. వారి సమస్యలను ఓపికగా విన్న వజ్జ బాబూరావు మాట్లాడుతూ ప్రజల సందేహాలు, ఆందోళనలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణిస్తుందని అన్నారు. ఈ అంశాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంబంధిత అధికారులతో చర్చించి ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు, విధానాలపై సరైన సమాచారం అందించడం అధికార యంత్రాంగం బాధ్యతని పేర్కొన్న ఆయన, ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ప్రతి అర్హులైన వ్యక్తికి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని, ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు.

హరిపురంలో ఘనంగా

జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్

మందస, జూన్ 13(వార్త): మందస మండలంలోని హరిపురం హైస్కూల్ గ్రౌండ్‌లో శనివారం క్రీడా సంబరం ఘనంగా జరిగింది. "మై టౌన్ న్యూస్" మొబైల్ అప్లికేషన్ యాజమాన్యం ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "జిల్లాస్థాయి గ్రౌండ్ కబడ్డీ టోర్నమెంట్" క్రీడాకారుల నడుమ ఉత్సాహభరితంగా సాగింది. ఈ క్రీడా మహోత్సవంలో పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని, క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగున్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని, యువత క్రీడాస్ఫూర్తితో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మందస మండల ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఇచ్ఛాపురం, జూన్ 13(వార్త): ఇచ్ఛాపురం మండలం తులసిగాం పంచాయతీ, ఇన్నీసుపేట గ్రామానికి చెందిన దుంగు గంగయ్య అకాల మరణానికి చింతిస్తూ ఆయన చిత్రపటానికి వైస్సార్సీపీ నాయకులు నివాళులు అర్పించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, వైస్సార్సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు సల్ల దేవరాజు, మండల పార్టీ అధ్యక్షులు ఆశి కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు దక్కత నూకయ్య రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి ఆశి పురుషోత్తం రెడ్డి, ఇసురు పరశురామ్ రెడ్డి ఇన్నీసుపేట గ్రామానికి చెందిన పార్టీ పెద్దలు, యువకులు శ్రద్ధాంజలి ఘటించిన వారిలో ఉన్నారు.

పైడిగాం పనులు పటిష్టంగా చేపట్టాలి

సోంపేట, జూన్ 13 (వార్త): పైడిగాం ప్రాజెక్టులో ప్రధాన కాలువ పూడికతీత పనులు పటిష్టంగా చేపట్టాలని ఎంజే పూలే రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు బీన ఢిల్లీరావు పేర్కొన్నారు. కార్యవర్గ ప్రతినిధులతో కలిసి శనివారం ఆయన పూడికతీత పనులను పరిశీలించారు. పనులు పారదర్శకంగా జరగాలని సూచించారు. ఎటువంటి అక్రమాలు జరిగినా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కప్పు గోపీనాథ్ కాళ్ల బాపూజీ, మరల జయ జయరావు, ఢిల్లీరావు, వీరాస్వామి పాల్గొన్నారు.

ఐఐఐటీకి సోంపేట మోడల్ స్కూల్ విద్యార్థులు

సోంపేట, జూన్ 13 (వార్త): సోంపేట ఏపీ మోడల్ స్కూల్ నుంచి నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ మాట్లాడుతూ వివరాలను అందజేశారు. లక్కవరం గ్రామానికి చెందిన నడుపూరు శృతి, సిలగాం గ్రామానికి చెందిన పండి శ్రీవత్స అవినాష్, సోంపేటకు చెందిన పొట్నూరు సాయి రోషిణి, సోంపేటకు చెందిన జడ ధనశ్రీ ఎంపికయ్యారన్నారు. వీరిని తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

తమ్మయ్య చెరువు ఆక్రమణలపై ఉదాసీనత

- ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం

- సమగ్ర విచారణ జరిపి నిజాలు వెల్లడించాలని డిమాండ్

నరసన్నపేట, జూన్ 13(వార్త): బొడ్డవలస రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న తమ్మయ్య చెరువు (కొత్త కర్ర చెరువు) భూముల్లో ఆక్రమణలు జరిగాయన్న ఆరో పణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. సుమారు 17 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు భూమిలో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు జరిగాయని స్థానికులు పలు ఆధారాలతో ఫిర్యాదులు చేసినప్పటికీ, సంబంధిత అధికారుల స్పందన కరువుపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయం తరపున ఎటు వంటి ఆక్రమణలు లేవని పేర్కొంటూ ఫిర్యాదును మూసి వేసినట్లు సమాచారం. అయితే చెరువు పరిధిలో నిర్మా ణాలు, భూఆక్రమణలు స్పష్టంగా కనిపిస్తున్నాయని స్థాని కులు పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థి తులకు భిన్నంగా నివేదికలు ఇవ్వడం పలు అనుమానా లకు తావిస్తోందని ప్రజలు అంటున్నారు. ప్రజా వనరులైన చెరువులు, కాలువలు, ప్రభుత్వ భూములను పరిరక్షించడం అధికారుల బాధ్యత కాగా, వాటి పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం ఆందోళన కలిగిస్తోందని అభిప్రాయపడుతున్నారు. చెరువులు గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల పరిరక్షణకు, వ్యవసాయ అవసరాలకు కీలకమైనవని, వాటిని ఆక్ర మణల నుంచి కాపాడాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి వాస్తవ పరిస్థితులను ప్రజలకు వెల్లడించాలని వారు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి చెరువు భూముల స్థితిగతులపై సమగ్ర విచారణ చేపట్టాలని, ఆక్రమణలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసు కోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ఆస్తుల పరిరక్షణలో పారదర్శకత ఉండాలని, వాస్తవా లను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.


ENDORSEMENT
PUBLIC GRIEVANCE REDRESSAL SYSTEM



బీసీ సంక్షేమ పాఠశాల విద్యార్థులకు యోగా శిక్షణ

నరసన్నపేట, జూన్ 13(వార్త): ఈనెల 21న నిర్వ హించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పుర స్కరించుకుని బీసీ వెల్ఫేర్ విద్యార్థులకు ప్రత్యేక యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. శనివారం నరసన్నపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏవో విజయానంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా గురువులు హరి, రవి, సుప్రజ విద్యార్థులకు వివిధ యోగాసనాలు, ప్రాణాయామ విధానాలపై అవగాహన కల్పించారు. యోగా సాధన ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని వివరించారు. నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని సూచించారు. విద్యార్థులు యోగాసనాలను ప్రాక్టికల్‌గా అభ్యసిస్తూ ఆసక్తి కనబరిచారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న ప్రధాన కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. ఈ సందర్భంగా ఏవో విజయానంద్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. యోగా ద్వారా క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆరోగ్యకర జీవనశైలి అలవడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యోగా శిక్షకులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

పోలాకి, జూన్ 13 (వార్త): నరసన్నపేట నియోజకవర్గ ప్రజల ఆరోగ్య భద్రత, సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. శనివారం ఆయన మబగాంఉన్న తన స్వగృహం వద్ద ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసన్నపేట మండలం కోమర్తి గ్రామానికి చెందిన బీశెట్టి త్రినాధమ్మకు రూ.2 లక్షలు, పొదిలాపు శివరాజ్‌కు రూ.1.20 లక్షల చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. వైద్య చికిత్సల కోసం భారీ ఖర్చులు భరించలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం పెద్ద ఊరట నిస్తోందని చెప్పారు. లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, చికిత్స విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములై వారి సంక్షేమానికి కృషి చేయడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరేలా కృషి చేస్తున్నామని, అవసరమైన వారు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి శిమ్మ జగన్నాథం, నీటి సంఘం అధ్యక్షుడు ముద్దాడ అప్పలనాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కింజరాపు సూర్యనారాయణ, పెదలాపు దాలినాయుడు, పాగోటి సూర్యనారాయణ, లొట్ల రామకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాళ్లు తేలిన కిన్నెరవాడ-వడ్డినవలస రహదారి

-అవస్థలు పడుతున్న వాహనదారులు

- రూ.15 కోట్లతో త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం - -ఆర్‌అండ్‌బీ అధికారులు



సారవకోట, జూన్ 13 (వార్త): సారవకోట మండలం కిన్నెరవాడ-వడ్డినవలస గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి రాళ్లు తేలి అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది మంది ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నప్పటికీ రహదారి దుస్థితి కారణంగా ప్రయాణం కష్టతరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రహదారి నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ అవి మధ్యలోనే నిలిచిపోవడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రహదారిపై పెద్దఎత్తున రాళ్లు బయటకు రావడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. వర్షాకాలం ప్రారంభమయ్యే ముందు రహదారిని మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.ఈ రహదారి ద్వారా పరిసర గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు నిత్యం ప్రయాణాలు సాగిస్తుండటంతో సమస్య మరింత తీవ్రంగా మారింది. రహదారి గుంతలమయంగా ఉండటంతో వాహనాల నిర్వహణ ఖర్చులు కూడా పెరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ శాఖ సహాయ ఇంజనీర్ (ఏఈ) సరోజను వివరణ కోరగా, కిన్నెరవాడ-వడ్డినవలస రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.15 కోట్ల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. పరిపాలనా ప్రక్రియలు పూర్తవుతున్నాయని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించి రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఆమె వెల్లడించారు. రహదారి నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని స్థానిక ప్రజలు, వాహనదారులు అధికారులను కోరుతున్నారు. రోడ్డు అందుబాటులోకి వస్తే గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు ప్రమాదాల సంఖ్య కూడా తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

ఐఐఐటీలో సీట్లు సాధించిన కోడూరు విద్యార్థులు

- మొదటి జాబితాలో ముద్దపు మౌనిక, ఎరిపిల్లి మెగ్న ఎంపిక

- పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమని ఉపాధ్యాయుల హర్షం

పోలాకి, జూన్ 13 (వార్త): ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) ప్రవేశాల తొలి జాబితాలో పోలాకి మండలం కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికై పాఠశాలకు గౌరవం తీసుకువచ్చారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోడూరు విద్యార్థినులు ముద్దపు మౌనిక, ఎరిపిల్లి మెగ్న లు ఐఐఐటి, శ్రీకాకుళంలో సీట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు జి.శాంతి తెలిపారు. మారుమూల గ్రామీణ ప్రాంతానికి చెందిన పేద కుటుంబాల విద్యార్థులు తమ ప్రతిభతో ఉన్నత విద్యా అవకాశాన్ని దక్కించుకోవడం గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. కష్టపడి చదివి ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయురాలు జి.శాంతి, విద్యా కమిటీ చైర్మన్ చింతాడ గున్నమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంతో దోహదపడిందని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా పట్టుదల, కృషితో ఉన్నత లక్ష్యాలను సాధించగలరని ఈ విజయం మరోసారి నిరూపించిందన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చింతాడ లక్ష్మణరావు, ఎం.వేణుగోపాలరావు, మోహిని, వెంకటరమణ, నారాయణరావు, శ్రీహరి, శాంతి, హేమలత, జగన్, బాడాన రాజు, రాజేశ్వరరావు, రఫీ, కళావతి, వసంతరావు, రాంబాబు, సూర్యకుమారి, గణేష్, రమణమ్మ, చంద్రయ్య, రాధ, ధర్మేంద్ర తదితరులు పాల్గొని విద్యార్థినులను అభినందించారు.

వైస్సార్సీపీ నాయకులు పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలి

ఇచ్ఛాపురం, జూన్ 13 (వార్త): వైసీపీ గత ఎన్నికల్లో 151 సీట్లు గెలుచుకుంటే, ఆ ఎన్నికల్లో ఈవీఎం మిషన్లు స్వచ్ఛమైనవి, 2024లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోతే ఈవీఎం మిషన్లు భ్రష్టు పట్టాయనడం సిగ్గుచేటని, వైస్సార్సీపీ నాయకులు హద్దులు తెలుసుకోవాలని, శాసనసభ్యులను విమర్శించే స్థాయి తమది కాదని తెలుసుకుంటే మంచిదని తెలుగుదేశం నాయకులు హితవు పలికారు. శనివారం వారు తమ పార్టీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. పదేపదే బారువ హాస్పిటల్ కోసం మాట్లాడుతున్నారని, గత గవర్నమెంట్ బిల్లులు సకాలంలో చెల్లింపు చేయక పోవడంతో కాంట్రాక్టర్లు ఇబ్బంది పడి పనులు నత్తనడకన సాగాయన్నారు. నాడు జగన్ పరిపాలనతో రాష్ట్రం 50 సంవత్సరాలు వెనకబడిందన్నారు. నేడు చంద్రబాబునాయుడు పరిపాలనను ప్రపంచ దేశాలు ఆయనకు స్వాగతిస్తున్నాయన్నారు. ఇచ్ఛాపురం డిగ్రీ కాలేజ్ విషయంలో మాట్లాడుతున్నారని, సుదూర ప్రాంతంలో డిగ్రీ కాలేజ్ కట్టడం, డిగ్రీలో ఉన్న వివిధ గ్రూపులు రద్దు పరచడం, స్టాఫ్‌ని తగ్గించడంతో నేడు అడ్మిషన్స్ లేక అక్కడ బిల్డింగ్స్ నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ముందు పుట్టినోడు ముష్టి అడుగుతుంటే సంతానం ఇవ్వరా సాంబశివ అన్నట్టు వైస్సార్సీపీ నాయకుల మాటలు ఉన్నాయన్నారు. సోంపేట నుండి ఇచ్ఛాపురం వయా ఈదుపురం రహదార్ణి, బ్రిడ్జి ప్రారంభోత్సవ సభలో వైసీపీ నేత నరేంద్ర యాదవ్ .. తన తండ్రి చిరకాల వాంఛ ఈ బ్రిడ్జి అని, శాసనసభ్యుడు అశోక్, ఎంపీ రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు ఈ పని పూర్తి చేసినందుకు స్వర్గంలో ఉన్న తన తండ్రి ఆనందిస్తాడన్నారన్నారు. అంతకన్నా సాక్ష్యం అశోక్ పనితీరుకు ఏమి కావాలన్నారు. విత్తనాలు కోసం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ప్రియా విజయ మాట్లాడారని, అసలు రైతులు ఎప్పుడు విత్తనాలు వేయాలి, ఎప్పుడు ఎరువు వేయాలి, ఎకరానికి ఎంత వెయ్యాలి అనేది ఆమెకి తెలుసా? అని ప్రశ్నించారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ అయిన ఇచ్చారా? ఈ రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలతో యువతకు ఉపాధి కలుగు తుందా లేదా వెన్నుపోటు అంటే అర్థం తెలుసా? వెన్నుపోటు అంటే తెలుగుదేశం పార్టీలో రాజకీయ అక్షరాలు దిద్దిన మీరు శాసనసభ్యులుగా గెలిచి కష్టకాలంలో ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని నడిరోడ్డుపైన విడిచిపెట్టి వెళ్లిపోవడం వెన్నుపోటు అంటారన్నారు. ఇకనైనా తప్పుడు కూతలు మాని ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి సహకరించవలసినదిగా డిమాండ్ చేశారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి, మెరుగు సూర్యనారాయణ రెడ్డి, మణి ప్రకాష్, పేదిని బాబ్జి, కామేశ్వరరావు , సీపాన వెంకట రమణ, సహదేవ్ రెడ్డి, దుర్యోధన, శ్రీనివాస్ రౌలోతదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546